పెళ్ళిపందిరి స్త్రీ పురుషుల కలకలలతో, పిల్లల నవ్వులతో మంత్రోచ్ఛారణలతో — రకరకాల ధ్వనులతో సందడిస్తోంది.

ఒక నూతనోత్తేజాన్ని కలిగిస్తోంది. కల్యాణ వైభవాన్ని చాటుతోంది. నీరజ— పెళ్ళి కుమార్తెగా అలంకృత అయి గౌరీపూజ చేస్తోంది.

పెళ్ళి పందిరి క్రింద అనుకుంటున్నారు.

"పెళ్ళికూతురి తల్లికి సుస్తీగా ఉందిట. మేడమీద గదిలో పడుకుంది."

"ఆ సుస్తీ ఏమీలేదు. ఆవిడకి మతిలేదు. ఆవిడకి అసలు ఈ పెళ్ళి ఇష్టం లేదు."

మధ్య మధ్య శంకరరావుగారు ఆందోళిత మనస్కులయి మేడమీదికి వెళ్ళి వస్తున్నారు. మూసిన గది తలుపు దగ్గర ఆయన నుంచుంటే లోపలి నుంచి ఆవిడ మాటలు వినిపిస్తున్నాయి.


"నాకు పిచ్చి ! ఈ జీవితంతో పాతిక ఏళ్ళ నుంచి పోరాటం సాగించాను. ఏమైంది ! నా కూతురు నన్ను అజ్ఞానురాలివమ్మా అంది. ఈ విషయంలో నీ మాటను అంగీకరించలేనురమా, అన్నారు ఆయన. అవును ఆయన అన్నీఅంగీకరించారు. అందరూ అన్నారు భార్యమాటకాదనడని. కానీ ఎవరికైనా తెలుసానా బాధ, ఏమేమి సహించానో! ఏనాటికైనా నాకేకాదు ఈ స్త్రీ జాతి బానిసత్వానికి విముక్తి ఉందా ? నేను ఎదురు ఈదానా ? ఏ ఆశయం సాధించాలని నీరజను పెంచానో ఆ న్నేళ్ల దీక్ష వ్యర్థమేనా."

"పురుషుడి ఆకర్షణ నుంచి స్త్రీకి విముక్తిలేదా ? స్వతంత్రాన్ని వద్దని పురుషుడి సహచర్యంలోనే తృప్తి పడతానంటుంది. నా జీవితమంతా గాథగా ఏ కరువు పెట్టినా అర్థం చేసుకోలేదా రాధ అన్ని సంసార బాధలూ పడుతూ "నీకుపిచ్చా ఏమిటి అమ్మా" అంది "నీకు మతిపోయిందమ్మా" అన్నాడు పెద్దకొడుకు రామం. అమ్మఅంటే అభిమానం ప్రాణం ఇచ్చే మురళి కూడా "అది చేసుకుంటానంటే నీకేం చేసుకోనీ అనుభవిస్తుంది" అన్నాడు.

నేనే ఊరుకోలేను.

"నేను జీవితాన్ని అర్థం చేసుకోలేదు అనుభవించలేదు. భర్తని ఎప్పుడూ ఒక అపరాధి లాగమనసులో పెట్టుకుని మసలుతూ గడిపానని నీరజ నన్ను అందని నేను విచారించను. తెలిసీ, నీరజను ఈ వలలోపడకుండా రక్షించలేక పోతున్నానని నా బాధ. ఎంత చెప్పినా నీరజ అర్థం చేసుకోలేదని నా కోపం. చేసుకోనీ పెళ్ళి. ఆ పెళ్ళి నేను చూడను. అసలు నేను బ్రతికిఉంటే కదా ! నీరజ పెళ్ళి— పిన్ని బాబాయ్ పీటలమీద—నాకు పిచ్చి."
గదిలోనుంచి నవ్వు వినిపించింది.

శంకరరావ్‌గారు తలుపుకు తలను ఆనించిగుండెను చేతితో రాసుకుంటూ "అబ్బా, రామా." అనుకున్నారు. అంతలో రామం అక్కడకు వచ్చి



"ఆ మూడు ముళ్ళూ పడేదాకా నిన్ను ఇటు రావద్దనలేదూ నాన్నా" అన్నాడు. కన్నీళ్ళు తుడుచుకుని "పదరా" అన్నాడు ఆయన.

నీరజ గౌరీ పూజ చేస్తోంది. తండ్రిని చూసి.

"అదేమిటి నాన్నా. అమ్మకి ఎట్లా ఉంది ?" అని ప్రశ్నించింది.

"తల్లిగా తన బాధ్యత నెరవేర్చలేక పోయింది. తల్లిదండ్రులం ఉండి కూడా నిన్ను కన్యాదానం చెయ్యలేక పోయాము" అన్నారాయన.

"నాన్నా" అంది నీరజ బాధగా, శంకరరావ్ గారు అంతలో సంబాళించుకుని

"కొంచెంసేపు అమ్మని మరిచిపో నీరజా." అన్నారు.

పూజ చేస్తోంది నీరజ. గడచిన సంగతులన్నీ ఆమెలో మనన మవుతున్నాయి. తనను, పరిసరాలనూ మరచి కొన్ని నిముషాలు అలా జరిగిన గాథలో లీనమైపోయింది.

ప్రకాశరావ్ వెళ్ళినవైపే చూస్తూ గేట్‌లో నిలబడింది నీరజ. తను తన ఉనికిని, మనిషిని మరిచిపోయి రెండు నిముషాల నుంచి అట్లాగే నిలబడి ఉందని గుర్తు రాగానే నవ్వుకుంది.

"దుష్యంతుడి కోసం శకుంతలలాగ" అనుకుంది తనలోనే.

ఆకాశంవైపు చూసి సంధ్యారాగం ఎంత అందంగా ఉంది! అనుకుంది. పిల్లగాలులు పూలసౌరభాలను మోసుకుని వస్తున్నాయి. వెనక్కి తిరిగే టప్పటికి, లైటు వెలిగించి వరండాలో నిలబడి తదేకంగా నీరజనే చూస్తున్నది రమాదేవి—నీరజతల్లి.

మెల్లగా నడుచుకుంటూ వెళ్ళింది నీరజ. ఆ దీపపు వెలుగులో తన కర్థంకాని భావమేదో తల్లి వదనంలో ఉన్నట్లనిపించింది నీరజకి. హాలులోకి వెళ్ళి తండ్రి దగ్గర కూర్చుంది. వెనకాలే రమాదేవి వచ్చి

"అప్లికేషన్ పంపించావా, నీరజా!" అంది.

ఒక నిముషం ఊరుకుని "ఇంక నేను చదవను!" అంది నీరజ. రమాదేవి ఆశ్చర్యపడుతూ.

"నిన్ను యూనివర్సిటీకి పంపిస్తాము. నువ్వు ఎమ్మే పూర్తి చెయ్యాలి నీరజా" అంది.

"పూర్తి చేశాక ?" అంది నీరజ.

"ఉద్యోగం." అంది రమాదేవి నిశ్చయంగా.

"ఎందుకమ్మా ఉద్యోగం !!" అంది నీరజ..

"దానికి ఇష్టం లేకపోతే ఎందుకు రమా. ప్రకాశరావ్ కూడా నాకు నచ్చాడు. నీరజకి కూడా ఇష్టమయితే...." అంటూ నవ్వారు శంకరరావ్‌గారు.

నీరజ ఒకసారి హాయిగా నిట్టూర్చుకుని దరహాసంతో తలదించుకుంది.

"వీల్లేదు. ఏం మించిపోయిందని. పెళ్ళి అవగానే ఏడాది అవకుండా పిల్లలు తయారు. ఇరవై ఏళ్ళయినా లేవు. నీరజ ఏమ్మే చదువుతుంది" అంది రమాదేవి. ఆవిడ మాటలలోని కాఠిన్యానికి తెల్లబోయింది నీరజ. శంకరరావ్ గారి పెదవులమీద నవ్వు మాయమయింది.

"అవునులే. తొందర ఏముంది ! తర్వాత ఆలోచిద్దాం" అని అవతలకు వెళ్ళిపోయారాయన.

నీరజ తప్పుచేసిన దానిలాగ సిగ్గుపడింది. కళ్ళలో నీరు తిరిగాయి. తన గదిలోకి వెళ్ళిపోయింది. మంచంమీద పడుకుంది. దిండులో తలదూర్చి, ప్రకాశరావ్‌తో నాన్నకి ఎక్కడో చుట్టరికం ఉంది. ఉద్యోగరీత్యా ఈ ఊరు వచ్చి బంధుత్వం మూలంగా శంకరరావ్ గారికి చేరువ అయ్యాడు. అతని చూపులు నీరజలో తొలివలపు బాణాలు అయ్యాయి. పద్దెనిమిది వసంతాలు నిండిన నీరజలో ప్రకాశరావ్ పరిచయంతో తీయని భావాలు మొలకెత్త నారంభించాయి. అతడి కళ్ళలోకి చూస్తూ కూర్చోవాలనిపించేది. అతడు వస్తానన్న వేళకి రాకపోతే తోచేది కాదు. ఈ ఆకర్షణని బలపరచినవి అతడి పరిజ్ఞానం, విమర్శనా దృష్టి, ఆత్మ పరిశీలన మొదలయిన వాటితో కూడిన అతడి వ్యక్తిత్వం. తల్లి సమాధానం నీరజని అవ్యక్తమైన వేదనకి గురి చేసింది.

రమాదేవి వచ్చి మంచం మీద కూర్చుని నీరజ తలమీద చేయివేసి

"పిచ్చిదానా, అమ్మ నిన్ను కష్ట పెట్టిందని భావిస్తున్నావా ! ఏ తల్లి అయినా తన స్వంత పిల్లలకి చెరుపు చేస్తుందా నీరజా. ఇది నీ మంచికే. ఆడపిల్లలకి పెళ్ళి ఒక తీయని కల. అంతే. ఆ తరువాత ఉండే దేహావస్థలు, ఆర్థిక బాధలూ అనుభవించిన వాళ్ళకే అర్థం అవుతాయి. ఇప్పటి నుంచే నిన్ను ఈ చెరలో పెట్టడం నా కిష్టం లేదు. ప్రేమ అనేది కేవలం పుస్తకాలలోనూ, సినిమాలలోనూ ఉండే కల్పన. నిజంగా జీవితంలో మనం దానిని అనుభవించ గలిగేది చాలా కొద్ది కాలం మాత్రమే. కనక దానికంత ప్రాముఖ్యం ఇవ్వకూడదు. దానికోసం భవిష్యత్తును పాడు చేసుకోకూడదు." అంది.

ఈ అమ్మని తను నొప్పించలేదు.

"సరేనమ్మా" అంది నీరజ.

నీరజ యూనివర్సిటీలో చదవటానికి వెడుతుంటే

"బాగా చదువుకోవాలి నీరజా. నా ఆశలన్నీ నువ్వు తీర్చాలమ్మా" అంది రమాదేవి రైలు తనను దూరంగా తీసుకు పోతుంటే.

"నేను బాగా చదవటమే అమ్మ ఆశయం" అనుకుని నవ్వుకుంది నీరజ.

రెండేళ్ళవరకూ నీరజ పెళ్ళి ప్రసక్తి రాలేదు. నీరజ పరీక్షలు రాసి ఇంటికి వచ్చింది. ఆ ఊరి కాలేజీలో నీరజ ఉద్యోగం చెయ్యాలని రమాదేవి పట్టుపట్టింది. తల్లి పట్టుదల, ప్రయత్నం చూసి నీరజ ఆశ్చర్యపడింది.

"రాధకి చదువు చెప్పించుదామంటే మొదట నుంచీ దానికి, తెలివీ శ్రద్ధా రెండూ లేవు. సరే పెళ్ళి చేశాం. అది ఏం సుఖపడుతోంది ! పిల్లలు, అనారోగ్యాలు, చాకిరీలు, ఆర్థిక ఇబ్బందులు, నిర్లక్ష్యం చేసే మొగుడు. ఇదేనా ఆడదాని బ్రతుకు ! చేతకాని వాళ్ళు ఎట్లాగో సంసారాలు ఈదుతారు. తెలివీ, సమర్థతా ఉన్న వాళ్ళు కూడా అదే బ్రతుకులో పడాలా. ఆడదానికి ఆర్థిక స్వాతంత్రం ఉండాలి ముందర" అంది ఆవిడ. నీరజ మాట్లాడకుండా వింది. మళ్ళీ ప్రకాశరావ్ విషయం కదిపారు శంకరరావ్‌గారు.

"మన బాధ్యత రమా." అన్నారు.

"మీ బాధ్యతా, పురుషులంతా ఒకటి కాదూ" అనుకుంది కసిగా రమాదేవి.

"ఆకర్షణా, ఆరాధనా పెళ్ళి అయేటంత వరకే. తరవాత మగవాళ్ళు మారిపోతారు నీరజా" అంది ఆవిడ.

ఈ రెండేళ్ళూ ప్రకాశరావ్‌ని మరచిపోలేదు నీరజ. ఒకసారి

"మీరింకా పెళ్ళి చేసుకోలేదా" అంది హాస్యంగా.

"మీనాన్న నాకు ఒకసారి ఆశపెట్టారు నీరజా. నాకు నచ్చిన అమ్మాయి లభ్యమయ్యే పక్షంలో ఇంకా కొన్నాళ్ళు ఆగుతాను." అన్నాడు అతడు.

ఏమి చెప్పాలో తెలియక తల ఒంచుకుంది నీరజ. ప్రకాశరావ్ వచ్చినప్పుడు ఆమె హృదయం శృతి చేసిన వీణగా మారి మధుర గానాన్ని ఆలాపిస్తుంది. అతడు వెళ్ళగానే ఆమెలో తుఫాను గాలులు రేగుతాయి.

"అమ్మ ఉద్దేశం ఏమిటి ! ప్రకాష్ అంటే ఇష్టం లేదా ? అసలు పెళ్ళి అంటేనే ఇష్టం లేనట్లు మాట్లాడుతుంది. వివాహాన్ని కాదంటే ఏ రకం జీవితం గడపాలి !"

నీరజ చేతిలో "సాధన రహస్యం" చూశాడు తండ్రి.

"నీరజ వేదాంత గ్రంథాలు చదువుతోంది" అన్నారు శంకరరావ్‌గారు రమాదేవితో. కొంచెసేపు ఊరుకుని, "మంచిదే. వైరాగ్యమంటే కాషాయి గుడ్డలు కట్టుకోవటంకాదు. మనసుకి నిగ్రహం' నిర్ణయించుకున్న మార్గంలో అచంచలంగా పయనించటమే నేర్పుతుంది. కనుక —ప్రతి జీవికీ వైరాగ్యం అవసరమే" అంది ఆవిడ.

ఆయన నవ్వి "నీకు అన్నీ తెలుసు. మరి జీవిత మార్గంలో వివాహం కూడా అవసరమే కదా." అన్నారు.

ఆవిడ మండిపడుతూ "మీరు ఊరికే పెళ్ళి పెళ్ళి అని ఎందుకు ఆరాట పడతారో నా కర్థం కాదు. నీరజ చదువు లేనిదా, సమర్థత లేనిదా. స్వతంత్రంగా బ్రతక కలదు నీరజ పెళ్ళి చేసుకోదు" అంది ఆవిడ ఖచ్చితంగా.

ఆయన కొంతసేపు మాట్లాడలేదు. "అది నీరజ అభిప్రాయం కూడానా !" అన్నారు. రమాదేవి మాట్లాడలేదు.

"సాధన రహస్యం" టేబుల్ మీద పడేసి గదిలో లైటు ఆర్పింది నీరజ. కిటికీ దగ్గర నిలబడింది. ఆకాశంలో తారకలు మెరుస్తున్నాయి ఈ విశ్వమంతా స్వప్నంలా ఒక భ్రాంతి !—కానీ అనుభవం మాత్రం నిజం సన్యాసి అయినా, సంసారి అయినా సాధువర్తన ముఖ్యం.

దేహధారణ గలిగిన మనిషి బ్రతుకుకి ఏది సహజం ? ఏది ప్రకృతి నిర్దిష్టం ? పురుషుడి సహచర్యంలోనూ, మాతృత్వంలోనూ పరిపూర్ణతనూ, ప్రేమతత్వాన్నీ తెలుసుకుని జీవిత పరమార్థం సంతరించుకుని, ఈ ఆత్మని విశ్వ ప్రభునిలో లీనం చెయ్యటమే తన మార్గం కాగలదు. తను ఏనాటికీ సన్యాసిని కాలేదు" నవ్వుకుంది నీరజ.

రమాదేవి ఆ గదిలోకి రావటం చూసి దీపం వెలిగించ బోయింది.

"వద్దు. లైటు వెయ్యకు నీరజా. వాళ్ళ అనుభవాన్ని పురస్కరించుకుని మన మేలెన్ని అభిలషించే వారు మనకి ఎన్నో చెప్పారు. అది అర్థం చేసుకుంటే మనం చేతులు కాలకుండా తప్పించు

కుంటాము. ఇది చదువు. విషయాలు నీకే తెలుస్తాయి. ఒకటి మాత్రం అర్థంచేసుకో— ఇప్పుడు నీ ఊహలు ఆదర్శాలు మాత్రమే. ఇందులో వ్రాసిన నా ఊహలన్నీ, అనుభవంలో నుంచి, ఆవేదనలో నుంచి పుట్టినవి." అని ఒక నోట్ బుక్ అందించి వెళ్ళిపోయింది. అది ఆమె డైరీ.

నీరజ పుస్తకం తెరిచింది. వేగంగా పేజీలు తిరిగిపోతున్నాయి.

పెళ్ళి స్త్రీ జీవితంలో—కేంద్రం వంటిది.

గడచిన బాల్యంలోని ఊహాగానాలకు, భవిష్యత్తులో ఎదురు చూస్తున్న వాస్తవమైన అనుభవాలకు అది వంతెన. ఆ వంతెన మీద నిలబడినప్పుడు ఎంత జలదరింపు— ఎంత సంభ్రమము, ఎంత సంశయాలతో ఊగిపోవాలి — మనసు. కానీ నాకు ఒకటే తెలుసు. హృదయంలో ఆనందంతో సమంగా ప్రేమ, అనురాగం పొంగి పొర్లుతున్నాయి.

ఈ ప్రేమలో ఈర్ష్యకి, అసూయకి, అనుమానాలకి తావులేదు. ఆయన ఎటువంటి వాడైనా ప్రేమించగలను — ప్రతిఫలాన్ని ఆపేక్షించకుండానే ప్రేమించగలను.

*    *    *

# నీరజ పెళ్ళి

ఆదర్శాలు కలిగి ఉండటానికి— అనుభవాల వరం వరలో ప్రతిఘటనలు ఎదుర్కొని వాస్తవిక జీవితంలో ఆదర్శాలను నిలుపుకోగలగటానికి మధ్య— ఒక జీవిత గమనం— ఒక నవల— ఒక జీవిత పరిసమాప్తి—

ఈ జీవితం ప్రారంభమయిందా ! ఏదో అసంతృప్తి ప్రవేశించింది నాలో.

అతడిని తృప్తి పరచలేననిపిస్తుంది.

ఈ జీవితాన్ని అతడికి దత్తం చేసి అతడిని తృప్తి పరచటంలో ఎంత హాయి ఉంది. అనుకున్నాను. అతడికి తృప్తి కలిగించలేక పోవటం బాధ కలిగిస్తోంది.

"స్కూల్ ఫైనలయినా చదివి ఉంటే బాగుండేది" అన్నాడతడు ఒకరోజు. చదవాలని అప్పుడే నిర్ణయించుకున్నా.

"ఇప్పుడెందుకు ఈ చదువు !" అతడు వినుక్కుంటే ఆశ్చర్యం కలిగింది.

నేను చదవటంలో అతడికి కుతూహలంలేదు అని తెలిసింది.

చదవకూడదు, క్వాలిఫికేషన్ ఉండాలి. "ఇంతకంటె విషం తాగటం తేలిక" చెప్పలేని నిరుత్సాహం కలిగింది. కనువిప్పు కూడా అయినట్లుంది. పెళ్ళి అయిన క్షణం నుంచీ కలలూ, ఊహాలోకాలూ మంచుతెరలా విడిపోయి, వాస్తవమైన ప్రపంచం, జీవితంలోని నిజం— వాటి నిజస్వరూపాలతో నిలబడతాయి. నిజమైన జీవిత సమస్యలు పెద్ద ఆకారాలు ధరించి ఎదురవుతాయి— కళ్ళ ఎదుట.

ఏమైనా అతడిని సంతృప్తి పరచటమే నా జీవిత లక్ష్యం. ఏ ఆడదాని లక్ష్యమైనా అదే. అట్లాగంటే అతడు నవ్వుతాడు.

"నన్ను తృప్తి పరచటం నీ ఆనందం ఎట్లా అవుతుంది !" అని. ఏమని సమాధానం చెప్పాలి ! వచ్చే జన్మలో స్త్రీ జై పుట్టండి" అనుకున్నా.

అవును. జీవితంలో అనేక మార్పులు వస్తాయి. అతడికి తృప్తి కనిగితే ఆ మార్పుకి నా అభ్యంతరం లేదు.

"ఆకర్షణీయంగా ఉండేట్లు అలంకరించుకోవాలి. గ్రాడ్యుయేట్ అయితే మంచిది. ఈ కాలానికి తగిన ఉద్దేశాలు, అలవాట్లు ఉండాలి. ప్రతి దానికీ తల ఊపటం కాక స్వతంత్రంగా ఆలోచించాలి. నన్ను ఎక్కువగా భావించనక్కరలేదు. ఎవరూ స్వార్థ రాహిత్యంతో ఉండలేరు. స్వార్థమే మానవుడికి ఉన్నతిని కలిగిస్తుంది.

ఇవీ అతడి అభిప్రాయాలు— నిజమే ఎంత అజ్ఞానంలో ఉన్నాను.

ఎప్పుడూ ఆధార రహితమైన ఊహాగానం చెయ్యటం తప్ప జీవితాన్ని అర్థం చేసుకోటానికి ప్రయత్నించలేదు.

"ఇతడు చెప్పినవి నేను సాధించలేనా ! ఎందుకు సాధించలేను ! తప్పకుండా సాధిస్తాను.

*    *    *

"మీరు చాలా మంచివారు. భార్యని చదివించాలని, తనతో సమానంగా భావించే ఆదర్శ భావాలు కలవాళ్ళు ఎక్కడ ఉంటారు !" అంటే

"అటువంటి పెద్ద మాటలు అనకు. నేను సామాన్యుడిని. కాలాన్నిబట్టి మన ఆచార వ్యవహారాలు మారాలి, వేషభాషలు ఉండాలి అంటాను. అంతే" అన్నాడు.

మనసులో ఏదో అసంతృప్తి ఉన్నా, నన్ను అదృష్టవంతురాలిగానే భావించుకుంటున్నాను. నాలో కొత్త ఆశలు నూతనోద్దేశాలు ఒక మార్పు త్వరితగతిలో తీసుకొని వస్తోంది. ఈ మార్పు నాకు ఆహ్లాదకరంగానే ఉంది.

*    *    *

ఒక ఏడాది ! ఏడాదిలో ఎంత మార్పు.


అతడు సినిమాకి వెళ్ళాడు. కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి.

తను లేకుండా అతడు వెళ్ళటం ఇది మొదటి సారి. అతడు అక్కడ ఒక సరదా పొందటం. నేను ఇక్కడ ఒంటరితనంలో—

అతను అక్కడ— నేను ఇంటిలో, ఒక్క ఏడాదికే తమ మార్గాలు విడిపోయాయా. ఇది సహించలేను. ఇది నా బాధ.

అతని వెంటనే ఉండాలని, అతడి సరదాలే నా సరదాలని భావించిన నా కోర్కెలు ఏమయ్యాయి! నెరవేరని ఆశయాలై వెక్కిరిస్తున్నాయి.

ఒక్క యేడాదిలో ఎంత మార్పు. ఇంతలో



తను మాతృ మూర్తి కాబోతున్నది. ఏ ముంది స్త్రీ బ్రతుకు !

వంట బాధ్యత, మాతృత్వం విధి, అతని వెంట వెంటే ఉండటం తన ఆశయం, అతడే తన జీవిత సమస్య. ఇదీ గృహిణీ ప్రపంచం. నా జీవిత వలయం. అతడేమి మారాడు !

నా అభిప్రాయాలు మార్చుకున్నాను. మనసు మార్చుకున్నాను.

నాలుగు గోడల మధ్య బందీ అయి— మాతృత్వానికి తలవంచి—

నా సర్వం కోల్పోయాను— నా ఆనందం, తృప్తి అన్నీ కోల్పోయాను.

మాతృత్వం సంతోషాన్ని ప్రసాదించటానికి బదులు విచార కారణ మయింది. అతడేం మారాడు.

ఒక్క ఏడాది — తన స్వప్నాలను ఈషణ్మాత్రంగా నిజం చేసుకోగలిగిన క్షణాలు ఉంటే ఆ ఏడాదిలోనే, స్వల్పమైన ఈ కాలం కోసం జీవితమంతా బలిచేసుకుంటుంది స్త్రీ. మాతృత్వం వరం కాదు. స్త్రీకి అది ఒక శాపం. ప్రతిఘటించలేని శాపం.

*  *  *

ఆ రోజు రాత్రి — సృష్టి చైతన్యంలోకి వచ్చిన నాటి నుండి జరిగిపోతున్న లెక్కలేనన్ని

38 వ పేజీ చూడండి


## సావిత్రి సౌందర్య రహస్యం

# 'లక్స్ నా చర్మసౌందర్యానికి దివ్యమైనది' అన్నది ఆమె



అది సౌందర్య కాంతి - అపూర్వమైన లక్స్ నురగ !
నా చర్మమును మృదువుగాను, నాజూకుగాను వుంచు చున్నది...
పరిమళమైన లక్స్ వుండగా మరియొకటి నా కెందుకు ? మీకు కూడాను !

లక్స్ టాయిలెట్ సబ్బు

సినీమా తారలకు సౌందర్యమునిచ్చే శుద్ధమైన, సౌమ్యమగు సబ్బు

4 వాసవెల్లి రంగులలోను, తెలుపులోను వున్నది.

హిందుస్థాన్ లీవర్ ఉత్పత్తి

LTS. 148-140 TL.

# ఆసియా కథ

కిందనే ఉన్న 'పిలి' చెట్టు నీడలు నది మీద వింతగా పడేవి. ఒక 'బరోతో'లో తను తెడ్డువేస్తూ అద్భుతంగా కదిలి వెడుతూ ఉంటే తన తమ్ముడు తన చుట్టాల అబ్బాయిలతో వచ్చని నీటి లోతుల్లోకి దూకుతున్నాడు. తను వేసే తెడ్డు చుట్టూ నీరు కదలుతున్నట్లే లేదుకాని రెల్లు పొదల మధ్య, పాచిలోనూ ఏదో జీవాలు రహస్యంగా దాగి ఉన్నాయని గ్రహించాడు, తను.

ఒక పిలి చెట్టు నీడ కింద కూర్చుని 'క్రోషె' పని చేసుకుంటోంది వాళ్ల అమ్మ. అప్పటికే ఆమె ఆరోగ్యం చెడిపోయింది. ప్రతిసారీ, పిల్లలు నీటి కింద నుంచి జిడ్డుగా నీరు ఓడుతూ పైకి లేచి నప్పుడు భయంతో, వాత్సల్యంతో నిట్టూర్చేది.

"ఎందుకింకా అక్కడే ఉంటారు ?" అని మందలించేది. ఆమె మందలింపులు వృధా అయేవి. "ఆ పాచిలో ఎన్నో సూక్ష్మక్రిములు...." గుంగ్రడటి ఆమె ముఖంలో కలవరం వల్ల ఏర్పడ్డ రేఖలు కనిపించేవి. "ఆగుస్తో, ఆ బరోతో వది లేసిరా...." ఇలా పిలుస్తూ ఉంటేనే ఆమె గొంతుక క్రమంగా తగ్గిపోయేది. ఆమె జీవితం కూడా చివరి రోజుల్లో ఇలాగే తగ్గిపోయింది. తన తల్లి జీవితం నిజంగా ఎంత సంకుచితంగా, చీలికలయిపోయి ఉండేదో ! ఇలాగ కాకుండా ఒక జీవితాన్ని తనకి ఇష్టం వచ్చినట్లు కల్పించి, ఊహించుకున్నాడు. ఒక వేసవిలో అయిపోయిన తర్వాత కూడా దానిలోని అందం మిగిలిపోయిన జీవితం.

ఇటువంటి సంఘటనలు ఎందుకు గుర్తుంజేవి తనకి ? ఏమో ! సజీవంగా ఉండేవనా ? తన కంఠాలతో బయటికి పలకాలని స్పందించే అనుభవాల వల్లనా ? పరిశీలనకి, పరీక్షకి లోనుకాని అనందాలవా ? ఈ అనుభవాలు, స్పందనలు భూతకాలానికి చెందినవి. నేటి మిస్టర్ సువెనోకి చాలాదూరం అయిపోయాయి.

తను ఎటువంటి మనిష్మైయి పోయాడు ? తన భావాలు, ధర్మబుద్ధి, కర్మనిష్ఠ, ఇవి సిగ్గుపడవలసినవి కావు; లోపల అస్పష్టంగా ఉండి పోయిన సంచలనాలకి, వాటిని పూర్తిగా బయటికి తీయులేని శక్తి ఏదీ సంభవించనందుకు తాను సిగ్గుపడక్కరలేదు. సముద్రం జల్లు, పాచి పట్టిన నది పక్కన వేసవి దినం, సుసానా పేలి క్కుల సాన్నిధ్యం, ఇవన్నీ తలుచుకుంటే తను సాధించినవన్నీ వ్యర్థం అనిపించ వచ్చు కాని సుసానాకి ఎదురుగా తను ఊహించగలిగినది ఏమిటి ? అనారోగ్యంతో బాధపడుతున్న భార్య, అమెలితా, అప్పటికే దూరం అయిపోయింది.

విమానం వారు చెప్పినట్లు, అణకువతో మిస్టర్ సువెనో 'సీటు బెల్టు' కట్టుకున్నాడు. రెండు గంటలు గడిచిపోయాయన్నమాట. మేఘాలని దూసుకుని మనిలా గట్టి నేలమీద ఎగురుతున్నారిప్పుడు. రెండు నిముషాలలో, ఒక కుదుపుకి సాలెగూళ్లన్నీ చెదిరి పోయాయి. కిటికీ గాజు మందంలో నుంచి తనకోసం కాచుకుని ఉన్న కారు డ్రయివర్ కనిపించాడు.

తర్వాత, నేలమీద, వేగంగా వెళ్లి పోతున్నాడు, తన ఆఫీసు వైపుకి. వీధుల మీది రద్దీలో నుంచి వెడుతున్నప్పుడు తన పరిసరాలని పూర్తిగా మర్చి పోయాడు. లాగునాలో కొబ్బరి ఎగుమతి చేసే కాతాదారుడి వ్యవహారాల్లో మునిగిపోయాడు. బయలుదేరిన అరగంటలో కారు ఆఫీసు ముందు వచ్చి నిల్చుంది. మధ్యాహ్నం రెండు గంటలకి ఉండే రద్దీని బట్టి ఇది మంచి వేగంగా వచ్చినట్లే అర్థం. ఆఫీసు జోన్స్ వంతెన దగ్గర, ఎస్కొల్టాలో ఉంది. కారుదిగి, సుపరిచిత మయిన మెట్లు ఎక్కి వెళ్లాడు. లిఫ్ట్‌లో వెళ్లటం అంటే అతనికి ఇష్టం లేదు. ఎయిర్ కండిషన్ నెమ్మదిగా శబ్దం చేస్తున్న గది ప్రవేశించి తన డెస్కు వెనక కూర్చున్నాడు. తన మెదడులో మెదులుతున్న ఆలోచనల కదలికలకి ఇది వంత పాడినట్లుంది. పక్క గదిలోకి వెళ్లి ఆరు మందిని పిలిచి ఏవేవో పనులు చెప్పాడు. బల్ల మీద మీటల నొక్కపోతూ ఉండగా ఒక పొట్లం కనిపించింది. దాని మీద, 'ఫిలిప్పయిన్ ఎడ్యుకేషన్ కంపెనీ నుంచి' అని రాసిఉంది. తన పేరు రాసిన దస్తూరి కారు డ్రయివర్‌ది అని గ్రహించాడు. "ఫెర్డీకి ఇవ్వమంటే ఇక్కడ ఉంచాడేమిటి ? అని గొణుక్కున్నాడు. పొట్లం విప్పాడు. చిరాకుతో అతని వేళ్లు వేగంగా పనిచేశాయి. రంగు రంగుల భూగోళం రెండు చెక్కలుగా బల్లమీద పడింది, "హం" అనే శబ్దం చేస్తూ, విడిపోయిన గోళం వంక చూసి, "ఫరవాలేదు. పాకింగ్ కోసం ఇలా విడదీశారు. !" అనుకున్నాడు.

ఆ గోళం సగాలు చూసి మిస్టర్ సువెనో ఒక క్షణం అనుకున్నాడు : నా ఆత్మ పరీక్ష ఫలితాలు ఇంత కసిగా ప్రదర్శిస్తోంది విధి, అని. తనే నిర్మించిన యంత్రంలో నుంచి బయటికి వచ్చిన ఒక దేవుడు వ్యంగ్యంగా చేసిన పని లాగుంది, అనుకున్నాడు. తనకొక పాఠం నేర్పాలనా ? సరే, అనుకుని రెండు సగాలని, చెరొక చేతిలోకీ తీసుకుని గోళం పూర్తి చేయ పోయాడు. కాని పరధ్యాన్నంగా ఉన్నాడు. చేతులు సరిగ్గా పనిచెయ్యటం లేదు. చనిపోయిన తన సోల్జరు తమ్ముడిని గురించి ఆలోచించటం లేదప్పుడు— రత్నం కోసం హృదయాన్ని అమ్మెయ్య రాదని పరిహాసంగా అన్నాడు అతనే, వ్యాపారం అనే గట్టి— చల్లని— రత్నం. తన జీవితం యొక్క సగాలని గురించి ఆలోచించటంలేదు, అప్పుడు. ఇవన్నీ పక్కకి తోసేసి, తన జీవితానికి అతీతంగా, లెక్క చెయ్యకుండా ఉండటానికి వీలులేకుండా ఉన్న విషయాన్ని గురించి ఆలోచిస్తున్నాడు. అనుభవం, దాని జ్ఞాపకం ఎంత వేర్వేరయిపోయి బయటికి చెప్పేందుకు కూడా వీలులేకుండా పోతాయి అనుకున్నాడు, ఈ రెండింటినీ చేర్చే విధానం లేదనేది ఒక పెద్ద సత్యం.

ఎవరికి ఏది వీలయితే అది చేస్తారు. తనకి వీలయింది తాను చేశాడు. ఒక చల్లని, గట్టి యదార్థాన్ని ఏరుకున్నాడు తను. ఏది మంచి దనుకుంటే ఆ పని చేస్తాడు తను. గోళాన్నంతా అసంపూర్ణంగా పరిశీలిస్తాడు — తర్వాత సింహావలోకనం చేసి, సంవత్సరాల తర్వాత మార్చేస్తాడు. బుద్ధితో గ్రహిస్తాడు.... అయితే ఆమెలితా సంగతి ఏమిటి? ఆమె జీవిత కాలంలో ఆమెని అర్థం చేసుకొనటం ఎలా ?

గోళం సగాలు అతుక్కున్నాయి. మిస్టర్ సువెనో దాన్ని కొంచెం వ్యంగ్యంగా తిప్పి చూశాడు. కాని వ్యంగ్యంతో బాటు ఉల్లాసం కూడా కలిసి లేకపోలేదు. వ్యవధి, సహనం ఉంటే దానిమీద ఏ ప్రదేశాన్నయినా పోల్చుకోవచ్చుకదా ! ★

# నీరజ పెళ్ళి

15 వ పేజీ తరువాయి

త్రాతులలాగే తన నిశ్శబ్దాన్ని భూమి మీద పరుచుకుంది. కిటికీలో నుంచి వచ్చే చల్లని గాలి నా ఒంటరి తనానికి భయాన్ని ఆపాదిస్తోంది. రాధకి జ్వరం వచ్చినప్పటి నుంచి నాకు నిద్రలేదు. ఉయ్యాలలో రాధకి ఇప్పుడే నిద్రపట్టింది.

"అతడెంత నిశ్చింతగా నిద్ర పోతున్నాడు ! పాపాయిని గురించి నా మనసులో ఉన్న ఆవేదన అతడికి ఉండదా.

అతడు తండ్రి—నేను తల్లి. ఇద్దరూ సమానం కాదా ! ప్రేమ పిల్లలమీద ఇద్దరికీ ఒక రకంగా ఉండదా ! ఈ ప్రేమ— మమకారమే కదా నన్ను బాధ్యతకి బాధకి గురిచేస్తుంది !

మనసులో ఆరాటం— అతడు నిద్రపోతున్నాడు. మృత్యువును గురించి ఊహ నరనరాలని కృంగదీస్తుంది.

అతడు ఉండగా ఏమిటి నాకీ ఒంటరితనం ! అతడిని లేపి నా భయం చెపితే, అతడి కౌగిలిలో, ఓదార్పులో నాకు శాంతిలభించదూ ! అనవసరంగా తిండుకీ ఆరాటం ! అతడిని చూసి అసూయపడటం

కానీ— అతడు నిద్రమత్తులో "నీకు ఊరికేనే భయం. మేలుకుని ఆలోచిస్తూ ఆరోగ్యం పాడు చేసుకోకు. పడుకో." అన్నాడు. నిద్రలో లీనమైపోయాడు. విసురుగా వెళ్ళి కిటికీ దగ్గర నుంచుంటే చల్లగాలి మొహం మీద కొట్టింది. మనసు కతినమై పోయింది. భయం దూరంగా పోయింది. ఈ నిశ్శబ్ద నీరవ నిశీధిలో ఏవో ఏవో జీవిత సత్యాలు గోచరిస్తున్నాయి—

నేను ఒంటరిదాన్ని— ఏ రెండు ఆత్మలూ ఏకం కాలేవు. అది వృధా ప్రయత్నం. నా ఉన్నతి నేనే చూసుకోవాలి. నా సుఖం శాంతి నేనే వెతుక్కోవాలి. "ఇతడా పురుషుడు ! ధీరోదాత్తుడు ! కాదు స్వార్థపరుడు."

*　　*　　*

"శాంతి ఎట్లా లభిస్తుంది ! మమకారాలు చంపుకోలేనంత కాలం శాంతి ఉండదు. నా సుఖం స్వతంత్రంగా ఉండ గలిగినది. ప్రతి విషయానికీ అతని మీద ఆధారపడటం కూడా నన్ను హీనస్థితికి —అసూయా ద్వేషాలకి గురిచేస్తోంది.

స్వతంత్రంగా ఉండగలిగితే అతడిని ఎందుకు ద్వేషించటం ! నా సుఖ శాంతులు నాకు లభిస్తే నేను కూడా అతడి లాగ నవ్వుతూ తిరగగలను. ఏమైనాసరే నేను గ్రాడ్యుయేట్ అవుతాను. ఆర్థిక స్వాతంత్రం లేనిదే ఒక్క అడుగు ముందుకు వెయ్యలేము. ఉద్యోగం చేస్తూ— పిల్లల్ని ఆయా చూస్తుంటే నా సుఖ శాంతులు నేనెందుకు వెతుక్కోలేను !

ఇంటర్ పరీక్షలు నెలరోజులు ఉన్నాయి. ప్యాసవ్వాలని చాలా పట్టుదలగా ఉంది. శ్రద్ధగా చదువుతుంటే.

"ఇట్లాగ ఉండి, పరీక్షకి ఏం వెడతావు !" అన్నాడుఅతడు. అప్పటికి ఏడవనెల—రాధతరవాత.

"ఏం ఇంత కష్టపడి చదివిమానెయ్యమంటారా!"

"సెప్టెంబర్‌కి వెళ్ళవచ్చు. ఈ ఆకారంతో—

# నీరజ పెళ్ళి

అందరూ నవ్వరా, నీకేమో ! నాకు చాలా సిగ్గుగా ఉంటుంది.''

''అవును, మీరు మనుష్యులు ! ఎవరు నవ్వినా నేను పరీక్షకి వెడతాను. నాకు సిగ్గులేదు. అప్పటికి ఇంకా నెలవ్వవధి ఉంటుంది, నాకు భయం లేదు.''

''ఎందుకంత పంతం నీకు....''

జలజలా నీళ్ళు రాలాయి కళ్ళలో నుంచి.

''నాకు పంతం ఎందుకు ! గుక్కెడు విషం దొరికితే....''

అతడి ముఖం వెలవెల బోయింది.

''అటువంటి మాటలని నన్ను కష్టపెట్టకు'' అన్నాడు. అతడి ముఖంలో బాధ నన్ను తాకింది. చేతులలో ముఖం కప్పుకుంటే దుఃఖం ముంచుకు వచ్చింది.

''నేనూ ఏదీ సాధించలేను ! ఏదీ సాధించ లేను !'' నాలోనే ఆ వేదన పడుతున్నాను. ముఖం మీద నుంచి చేతులు, తీసి కన్నీటిని తుడుస్తూ.

''పోనీ నీ ఇష్టం వచ్చినట్లే......'' అన్నాడు.

''నాకు అర్థం కాదు. నేను మిమ్మల్ని నొప్పించ లేను. కాని ఎందుకు ఇట్లాగ ప్రవర్తిస్తానో నాకే అర్థం కాదు.'' అని అంటుంటే నా మనసు మమకార పూరితమై పోయింది.

అతడు ''మీ ఆడవాళ్ళంతా అంతే.'' అన్నాడు.

పోయిన కోపం, వ్యథ తిరిగి వచ్చాయి నాలో

''నేనూ అందరివంటి దాన్నే, అతడికి నేనేమీ ప్రత్యేకత కాదు. ఒక ఆడదాన్ని అంతే.''

ఈ హృదయంలోని ఆవేదన, బాధ ఇక్కడే అణగారి పోవాలి. మనసు అనేది ముఖంలో కనిపించదు. సూచన మాత్రంగా కనిపించినా దాని వెనక ఉన్న తుఫానులు అగ్ని పర్వతాలు చూడగల సహృదయత, సాహసం ఉండవు. చూడగలిగినా వాటిని అణిచి తప్పించగల తీరికా, దీపికా ఇంకొకరికి ఉండవు. ఎవరి సుఖ దుఃఖాలు వారివి. ఎవరి సంతోష సుఖాలు వారు వెతుక్కోవలసినదే. తమ ముఖం చూచుకోలేని వాళ్ళు దుఃఖాక్రాంతులు కావలసినదే. నా సుఖం నేను వెతుక్కోవాలి. అవును. అతడు నాకు ఆశలు చూపించాడు. కాని అవి మృగతృష్ణలు. నా కోసం అతడేమైనా మారాడా ?

మమకారం స్త్రీలోని బలహీనత— ఇది ప్రకృతి సిద్ధమైతే దీనిని సమూలంగా పెరికి వేయాలి. ప్రకృతిని నిరోధించటంలోనే మానవుడి అభివృద్ధి ఉంది.

అసలు ఏమిటి నేను కోరుతున్నది—

అతడి కోసం నేను అన్నీ వదులుకోగలను — అతడు కూడా నా కోసం అన్నీ వదులుకోవాలి ! ఇదీ ఆరాటం— తీరని దాహం— ఆరని కార్చిచ్చు.

అతడు కొంచెం దుష్టుడైనా— నేను ఇంకొంచెం మూర్ఖురాలిని ఐనా ఈ సమస్య ఉండే దికాదు.

నేను అతడిని గురించి ఆలోచించినట్లు అతడు నా గురించి ఆలోచించడు. అతని సుఖాలకు ఆటంకం లేనంత వరకూ అతడు నన్ను గురించి ఆలోచించడు. ఏ స్వతంత్రం కోసం నేను మథన పడుతున్నానో, ఏది ప్రకృతి నాకు ప్రసాదించ లేదో అది అతడిని అనుభవించవద్దు అనడానికి నాకు హక్కులేదు. కానీ అతడు నా గురించి ఆలోచించకుండా, మమకారానికి అతీతంగా ఎట్లా బతక కలుగుతున్నాడో ! ఆ స్వతంత్రాన్ని నేనూ సాధించాలి. ఈ సారి పురిటికి పుట్టింటికి వెళ్ళదలుచుకోలేదు.

* * *

అతడు స్నేహితుని పెళ్ళికి వెళ్ళాడు.

''రెండు రోజుల నుంచి జ్వరం— కడుపులో భారం— మనసులో శూన్యం.

''నీకేం భయంలేదు. కేశవ్ వచ్చి చూస్తుంటాడు. జ్వరం తగ్గిపోతుంది. పెళ్ళి మళ్ళీ రాదు చూడూ.'' అతడు వెళ్ళిపోయాడు ఊరికి.

ఉయ్యాలలో పాపాయి. నా చూపులు శూన్యంలోకి.

''అతడు వెళ్ళిపోయాడు. అతడికి స్నేహితులు సరదాలు కావాలి. నాకు జ్వరం తగ్గిపోతుంది. ఫరవాలేదు— ఊహు. తగ్గకూడదు. ఇది ఎక్కువై పోవాలి అన్ని మమకారాలు పెంచుకుని, ఇతడిని పట్టుకుని ప్రాకులాడుతున్న నేను దిక్కుమాలిన దానిలాగ చచ్చిపోవాలి — అప్పుడేనా అతడికి బాధ కలుగుతుందా! కర్మ అనుకుంటాడు. కర్మ చేస్తాడు. ఏడాదిలోగా మళ్ళీ పెళ్ళి చేసుకుంటాడు. నేను ఏమై పోయినట్లు, ఎవరి కోసం బతికినట్లు !

''ఓరే! ఎందుకురా ఆపిల్లితో ఆలా లాగుతావు! తప్పమ్మా!'' బామ్మగారి మందలింపు.

''లేదు బామ్మా! నేనూరికే దాని తోక పట్టుకుంటే అదే లాక్కుంటోంది'' మనవడి సమాధానం.

భాగీరథీ అమ్మాళ్ (బృందావనం)

నేను నా కోసం బతుకలేను. అతడికి నేను అవసరం లేదు. ఈ జీవితానికి అర్థమేమిటి ? ఈ సమస్యకి జవాబేమిటి ? ఈ ఆవేదన చల్లారేది ఏ విధంగా ? కన్నీళ్ళు జలజలా కారాయి.

''నవ్వుతూ జంటగా తిరిగే ప్రతి స్త్రీ సంతోషంగానే ఉందా ? వెనకాల ఏ కన్నీటి చరిత్రలు ఉన్నాయో ? ఏ అగ్ని పర్వతాలు రగులు కుంటున్నాయో ! లోకంలో స్త్రీది కన్నీటి చరిత్ర.

దారీ తెన్నూ లేని ఆలోచనలలో మథన పడుతుంటే డాక్టర్ కేశవ్ వచ్చాడు.

''జ్వరం తొంభై తొమ్మిది ఉంది. రేపటికి తగ్గుతుంది.

''జ్వరం తగ్గకపోతేనే నయం. జ్వరం ఉంటేనే బాగుంది.''

''ఎందుకని !''

''లేకపోతే మీరు కూడా చూడటానికి రారు కదా'' కన్నులలో ఒక మెరుపు పెదవుల మీద నవ్వు— అతడిని ఆకర్షించాలనే భావం నాలో ఎప్పుడు కలిగిందా అనుకుంటూ, ''పాపానికి శిక్షలాగ, మనసులోని ఆవేదనకి ఒక బాధ తోడైతే ఉపశమనం కలిగిస్తుంది.'' అన్నాను.

''మీరు అట్లా అంటున్నారు, నాకు జ్వరం వస్తే మా శ్రీమతి క్లబ్‌లో టెన్నిస్ ఆడుతూ ఉంటుంది.''

''ఆవిడ డాక్టర్‌గారి భార్యకదా ! అయినా ఆవిడ ఆడుకుంటున్నంత మాత్రాన ఆవిడ మనసులో ఆనంద పడుతోందని అనుకోలేము. అదీ ఒక రకంగా, తీరని కోరికల్ని ఇంకొక రకంగా తీర్చుకోవటం వంటిదే.''

''సరే, వస్తాను'' అన్నాడు.

''సాయంత్రం మీకు పని ఉందా !''

''ఏం అట్లా అడుగుతున్నారు !''

''నాకు తోచటం లేదు. పోనీ సినిమాకి వెడదామని. రాజ్యలక్ష్మితో చెప్పండి.''

''ఓ తప్పకుండా.'' అతడు వెళ్ళిపోయాడు.

కేశవ్‌ని సినిమాకి రమ్మనటం ఎందుకు ! సహజంగా లేదు. సరదాకి అడగలేదు. మనసులో అతడి మీద పగతీర్చుకోవాలని. అతడికి బాధ కలిగించి తన్ను గుర్తించేటట్లు చెయ్యాలని. అతడికి అసూయ కలిగించాలని కేశవ్‌ని ఇందులోకి లాగటం దేనికి ! — నేను బాధపడినట్లు రాజ్యలక్ష్మి బాధపడదా ! ఒక పురుషుడిమీద ద్వేషంతో ఇంకొక స్త్రీకి అన్యాయం చెయ్యటమా ! అది ధర్మానికి వ్యతిరేకం. నాకు ఎంత అన్యాయం జరిగినా సరే ధర్మానికి వ్యతిరేకంగా నడవలేను. నేను ఎవరికీ అన్యాయం చెయ్యలేను. ఇంతగా ద్వేషించే అతడికి కూడా అన్యాయం చెయ్యలేను. నేను చేయగలిగింది నన్ను రక్షించుకోవటం ఒకటే త్వరలోనే అతడు నన్ను మరచిపోతాడు. అది మాత్రం నిజం. అది అతడి స్వభావం.

అతడికి నాలో ఉన్నట్లు ఆవేశం లేదు, ధర్మ తత్పరత లేదు. జీవితం అనే ఆరాటం లేదు. అతడికి కావలసినవి దొరుకుతాయి. నాకు దొరకవు. అతడికి బాధ్యతలు ఉన్నా, అవి నెరవేర్చడంలో స్వతంత్రం ఉంది. నాకు స్వతంత్రం లేదు. తేడా అంతే. అతడు బాధ పడడు కనక నేను ఈ లోకంలో నుంచి తప్పుకున్నా అతడికి అన్యాయం చేసినట్లు కాదు. కోరినవి పొందలేని ఈ జీవితం వ్యర్థం. కోరినది పొందలేక తప్పుదారులు త్రొక్కటం, ఇతరులకి అన్యాయం చెయ్యడం ఎందుకు ! ఒక గుక్కెడు విషంతో ఈ తీరని వేదన అంతం అవుతుంది. ఒక దుఃఖ చరిత్ర సమాప్తం అవుతుంది. ఇంకొక ఇసుక రేణువును కలుపుకున్న మహా ప్రవాహం నిశ్చింతగా సాగిపోతుంది—

కన్నీళ్ళు ఆగాయి, ఆవేదన అణిగింది. ఒక నిశ్చలత మనసును ఆవరించుకుంది ఇప్పుడు ఆలోచన— నా నిలువునా ఆక్రమించిన ఆలోచనని కార్యరూపంలో పెట్టాలి. ఇది ఒకటే ఆలోచన కేంద్రీకృత మవుతోంది—

కేశవ్, రాజ్యలక్ష్మి వస్తారు వచ్చేలోగా—

ఈ పాప ! ఆ పాప నాకేమీ కాదు. ఆ మమకారం నాకు లేదు. లోకంలో ఎందరు మాతృ హీనులు బతకటంలేదు ! అతడే పెంచుకుంటాడు. పిల్లలు మాత్రం— పెరుగుతారు ! రెక్కలు వచ్చి పక్షులు ఎగిరిపోవటం లేదూ. మానవులు మనసు ఉంది కనుక మమకారాలు పెంచుకుంటారు. అవే బంధాలు అవుతాయి. ఇవన్నీ అనవసరం.

ఈ పాప అసలు నా ఆలోచనే కాదు. పాపని రాజ్యలక్ష్మి దగ్గరకు పంపిస్తాను. వాళ్ళు వచ్చే లోగా—

పాపకి పాలుపట్టి మంచి గౌను తొడిగి, పాప ఆడుకుంటుంటే చూస్తూ శిలా ప్రతిమలా కూర్చున్న నా కళ్ళ నుంచి నీళ్ళు జలజలా రాలాయి.

"అతడు మంచివాడే. లోకంలో పురుషులంతా తమ భార్యలని ఎట్లా చూస్తున్నారో— అనురాగంగానే చూస్తున్నాడు ! నా కోరికలే గగన కుసుమాలు. నాకు ప్రతిఫలం కోరకుండా ప్రేమించటం తెలిస్తే ఎంత బాగుండేది. పెళ్ళినాటికి నా సర్వసం అతడికి అర్పించటానికి సిద్ధపడ్డాను — ఆ మాటకి అతడు నవ్వాడు. నాలో సగం నీవన్నాడు. సుఖ దుఃఖాలు ఇద్దరివీ అన్నాడు.

కానీ సుఖం అతడు— దుఃఖం నేను.

అతడు వెన్నెల— అతని వెన్నెల నీడ నేను.

అతడింకా నా స్వార్థ రాహిత్యాన్ని పరిహసించాడు. ఎవరూ స్వార్థం లేకుండా ఉండరన్నాడు. అది ఆత్మ వంచన అన్నాడు. మీ ఇష్టప్రకారం అంటే కాదు నీ ఇష్టం కూడా చెప్పమని నాలోని స్వార్థాన్ని మేల్కొలిపాడు. నాది ఒకటే ఆశయం. అతడు చంద్రుడు— నేను వెన్నెల. అతడు పాలు— నేను రుచి. నేనులేని అతడు సారహీనుడు. అతడు లేకపోతే నాకు మన్నికేలేదు. చంద్రుడులేని వెన్నెల ఉంటుందా ! పాలు లేకుండా కోవా వస్తుందా ! ఈ మాధుర్యాలు నా బ్రతుకును పులకితం చేశాయి, ఒక ఏడాది. ఒక్క ఏడాది మాత్రమే. కొంచెం అలిగితే చాలు బ్రతిమాలుకునే వాడు. నేను లేకుండా ఎక్కడికీ కదిలేవాడు కాదు. మొదటి సారి అతడు ఒక్కడే సినిమాకి వెళ్ళినందుకు నా కన్నీరుచూసి ఆశ్చర్యపడ్డాడు.

"చూడాలని ఉంటే నువ్వూ వెళ్ళు..." మొదటిసారి అతడు నాకు అర్థం కాలేదు. నా కిష్టమైతే నేను విడిగా వెళ్ళవచ్చు. ఇదా నా స్వతంత్రం అతడి సహచర్యలో ఉన్న మాధుర్యంలో అతడితో ఉండటానికే కోరుకున్నాను నేను ! నన్ను విడిచి ఉండటం అతడి కేమీ బాధకాదు. అది అసూయలకి అతీతమైన విశాలమైన ప్రేమా లేక నాపట్ల నేను వాంఛించేటంత అనురాగం లేక పోవటమా. బాధ్యతా రహితంగా ఉండటమా ? ఈ స్వతంత్రం నా కవసరంలేదు.

నేను లేకుండా అతడు సంతోషంగా ఉండ కలడు. నువ్వూ ఉండు అంటాడు. నాకు అందులో సంతోషంలేదు — ఆ స్వేచ్ఛ నాకు ఆనందాయకమెట్లా అవుతుంది ! ఏడాది కతడు మారిపోయాడు.

"విశ్రాంతి తీసుకో, రాజ్యలక్ష్మితో కబుర్లు చెప్పుకో." అంటాడు.

ఇది నేను ఎదురు చూడలేదు, సహించలేను—

నాలో స్వార్థం లేచింది, దాన్ని అణచలేను.

ధర్మానికి స్వార్థానికి సంకుల సమరం ఆరంభమయింది.

ఈ తప్పుకి మాత్రం బాధ్యత అతడిది. నాలో స్వార్థాన్ని, అభిమానాన్ని రెచ్చగొట్టాడు. "నీ ఇష్టం" అని స్వతంత్రంగా ఉండటంలో గల నా అశక్తతని నాకు తెలియ జేశాడు. అభిమాన త్యాగం చేస్తే కానీ నాకు ముక్తిలేదు. దుఃఖంలో, నా మనసు దానికి అంగీకరించటం లేదు. ఈ విపరీత తాకిడి పరిస్థితిలో కూడా అతడు నన్ను గుర్తించడు. అతడు గుర్తించని నా ప్రేమ — త్యాగం వ్యర్థం. ఆనందం దొరకని బ్రతుకే వ్యర్థం. అతడికి నా నుండి ఏమీ అవసరంలేదు. నేను నాకోసం బ్రతకలేను. పాపకి మాత్రం నేను ఏమౌతాను ! ఆ పాపకి కూడా కొన్ని రోజులు పోతే నేను అవసరం లేదు. ఎవరికోసం బ్రతకాలి ! ఎందుకు బ్రతకాలి!

చలన రహితంగా ఉన్న నాలో మళ్ళీ దుఃఖం స్పందించింది. మంచంమీద ఏడుస్తూ పడుకుంటే కన్నీళ్ళు ఆగాయి. తిరిగి మనసు గట్టి పడింది.

"ఉహూ. చచ్చి లాభం లేదు. సాధించేది ఏమీ లేదు. పాప ఆడపిల్ల. ఏ ధర్మమైతే, ఏ ఆశయమైతే నన్ను ఇట్లా అస్వతంత్రురాలిగా, దుఃఖితగా చేసిందో— ఆ ఆశయాలకీ, మమకారాలకీ విరుద్ధంగా పెంచుతాను. నేను ఎట్లాగూ ఓడిపోయాను. నాలో అంశమైనా ఇది సాధించాలి. ఈ పాపని తీసుకుని ఎక్కడికైనా వెళ్ళి పోవాలి."

రాజ్యలక్ష్మి వచ్చేటప్పటికి పడుకుని ఉన్నాను.

"తల నొప్పి విపరీతంగా ఉంది. మీరు వెళ్ళండి." అన్నాను.

"నువ్వివాళ తమాషాగా ప్రవర్తిస్తున్నావన్నారు డాక్టర్‌గారు." అంది రాజలక్ష్మి నా ప్రక్కలో కూర్చుని నా చేతిలో చేయివేసి. కళ్ళు మూసుకుని కొలకుల్లోంచి నీరు కారుతుంటే.

"అవును ఆయనకి సైకాలజీ తెలుస్తుంది కదూ. నా మనసు బాగుండలేదు."

"పోనీ రెండు రోజులు మా ఇంట్లో ఉండ కూడదూ." అంది రాజ్యలక్ష్మి.

"రేపు వస్తానులే. మీరు సినిమాకు వెళ్ళండి" అన్నాను. వాళ్ళు వెళ్ళిపోయారు.

అవును. వాళ్ళకి మాత్రం అంతకంటె పట్టించుకోవటానికి నేనేమవుతాను !

నేను ఎవరికి ఏమీకాను — ఒంటరి దాన్ని. ఇంత ప్రపంచం చీకటి మయమయి పోతోంది— ఈ అనంతమైన గాఢాంధకారంలో నేను ఒంటరి దాన్ని. ఈ చీకటిలో నాదారి నేను వెతుక్కోవాలి. ఈ పాప నాకు తోడుకాదు. ఒక భారం.

ఎక్కడికో వెళ్ళిపోవాలి. స్కూల్ ఫైనల్ పాసయిన నేను గౌరవంగా నా పొట్ట పోసుకో గలను. ఇవి అమ్మా నాన్నా అభిమానంతో ఇచ్చిన గాజులు— గొలుసు.

స్త్రీని పురుషుడు కామిస్తాడు— లేదా ఆరాధిస్తాడు. ఈ ఏడాదిలో అతడు నా నుండి ఏమి తీసుకున్నాడు ! నేనేగాక ఎవరైనా ఈయగలిగిన సుఖం— అంతే, నేనేమీ అతనికి ఇవ్వలేకపోయాను. ఈ పెళ్ళి నగలు నాకు అవసరం లేదు. ఈ ఒక్క ఉంగరం అతడు కొని స్వయంగా వ్రేలికి పెట్టాడు. అవే నేను ఆనందపడిన క్షణాలు. అది ఒకటీ చాలు."

పాపను ఎత్తుకుని బయటికి వచ్చిన నాలో ఏ ఆలోచనా లేదు. ఆలోచనలు స్తంభించాయి. చేస్తున్న పనికి పూర్వాపరాలు ఆలోచించటంలేదు.

అందరికీ దూరంగా— ఒకటే ఆలోచన— ఎక్కడికో వెళ్ళిపోవాలి. రిక్షా కనుపించింది. స్టేషన్‌కి అని చెప్పాను. రిక్షా కదులుతుంటే— అంతవరకూ స్తబ్దంగా ఉన్న మనసు విపరీతమైన వేడికి తీవ్రంగా కరిగే మంచులాగ త్వరలో చలనాన్ని అందుకుంది. ఒక్కుమ్మడిగా ఏడుపు వచ్చింది.

"ఎక్కడికి ఈ పారిపోవటం ! శాంతి కోసం— ఇంత అశాంతి మనసులో పెరిగిపోతున్న నాకు బయట ప్రపంచంలో శాంతి లభిస్తుందా ! తెలుసు— లభించదని— నా శాంతి నా మనసులో —అతని నీడలో ఉందని.

రిక్షా స్టేషన్ ముందర ఆగింది. దిగి డబ్బులిచ్చి ప్లాట్‌ఫారం మీద నిలబడితే ఎవరైనా చూస్తారనే భయం కలగలేదు. ప్లాట్‌ఫారం మీద ఒక చెట్టు క్రింద నుంచున్నాను.


"నా శాంతి నా మనసులో ఉంది. అతడి లాలనలో ఉంది. ఎట్లాగైనా అతడినే మంచి చేసుకోవాలి. అతడినే లొంగతీసుకోవాలి. అతడు నన్ను లక్ష్యంచకపోతే — అతడు నాకు ఈయగలిగిన క్షణాలనే అమరం చేసుకోవాలి. అదీ నా బ్రతుకు" వెక్కివెక్కి ఏడుపు వచ్చింది.

దిక్కులేని దానిలాగ రైల్వే ప్లాట్‌ఫారం మీద నిలబడి ఏడుస్తున్నాను.

ఏడుపు ఎందుకు ! ఏడ్చి సాధించేది ఏమిటి ?

దీనిలో అతడి తప్పులేదు. అతడు పురుషుడూ స్వతంత్రుడు. ప్రకృతి అతడిని అనుగ్రహించింది. అనుభవించమంది. అనుభవించవలసినదే.

అతడు మమకారాలకి అతీతుడు ప్రేమించ గలడు, దానికి అతీతంగానూ ఉండ కలడు. నాకు ప్రేమించటం ఒకటే చేతనవును. దానికి అతీతురాలిని కాలేను. బాధపడతాను, ద్వేషిస్తాను. ఈ వికారాలకు దూరమై స్వతంత్రంగా ఉండ లేదు నా మనసు. నేను అబలనే. అబలైనందుకే దుఃఖించాలి. అతడెప్పుడూ అన్యాయం చెయ్య లేదు. నా స్వతంత్రానికి అడ్డురాలేదు. నా దుఃఖానికి నేనే కారణం. పురుషుడే సర్వంగా భావించేటట్లు స్త్రీని సృష్టించటమే కారణం. అన్నిటికీ ఒతీతంగా పురుషుడిని సృష్టించిన భగవంతుడే కారణం. దీపం పురుగు వెళ్ళి జ్యోతిని ముద్దు



'నువ్విచ్చిన తైలంతో; వున్న తెల్ల వెంట్రుకలు కూడా ఊడిపోయాయి! ఈ ఒలితో నలుగురి కంటా పడలేక పోతున్నాను! మరేదన్నా మందు ఉందా ?...'

'ఉన్నాయిగా సార్ ! ఫస్టుక్లాసు తెల్ల ఖద్దరు టోపీలు ! ఓ డజను యివ్వమంటారా ? మీకైతే రేటు తగ్గించే యిస్తా.. '

పెట్టుకుంటే తప్పు దీపానిదా ! గాలిలో దీపం పెట్టి దీపం ఆరిపోతే తప్పు గాలిదా ?

ఈ అనుభవించాలి అవే ఆరాటం, నా జీవన జ్యోతికి ఒక పెద్ద గాలి వంటిది. అతడి ప్రేమకి ఆశించటం మృగతృష్ణలో దాహం తీర్చుకోవటం వంటిది. అతడూ ప్రేమిస్తాడు. అంతకంటే అతడివ్వలేడు. తీరని కోరికలు కలిగి ఉండటం తప్పు నాది.

"నీ ఇష్టం వచ్చినట్లుండమన్నాడు." నేనే ఉండలేను. నేను ఎంత బలహీనురాలినో నాకే తెలిసి వచ్చింది.

"కానీ, అతడి మీద మనుకారంతో ఇంత బాధ ననుభవిస్తున్నాననే సానుభూతి ఉండ నవసరం లేదా ! జీవిత సహచరిణి అనే స్నేహ భావం ఉండ వద్దా ? ఈ చెలిమి, మమతలు లేక పోయాక జీవితంలో మాధుర్యం ఏమిటి గృహిణికి — పురుషుడికి బయట ప్రపంచం ఉంది. గృహిణిలోని స్త్రీత్వం ద్వారా అతడు పరిపూర్ణు డవుతున్నాడు. ఆ పరిపూర్ణతకి అలముటించే స్త్రీ గతి ఏమవుతోంది ! దుఃఖాక్రాంతి. పరాజయంలోని అసహనం, అశాంతి ! ఈ వెన్నెల నీడని ఎందుకు సృష్టించావు ప్రభూ. నీడ లెరుగని నిండు పున్నమిని ఎందుకు సృష్టించలేదు నువ్వు......"

"నేను వెళ్ళలేను. దుఃఖమైనా అతడి నీడలోనే శాంతి ఉంది నాకు." స్టేషన్ బయటకు వచ్చాను. కనుపించిన రిక్షా ఎక్కి ఇంటికి పోనీయమన్నాను. ఆ మాటే మనన మవుతోంది—

"ఈ వెన్నెల నీడని ఎందుకు సృష్టించావ్— భగవాన్."

ఇంటికి వచ్చాక నిశ్చయించుకున్నాను. "ఏనాడూ కన్నీళ్ళు పెట్టకూడదు. అతడిని ఒకమాట అనకూడదు. అతడు ఈయగలిగిన దానితో తృప్తి పడాలి. అప్పుడు నేను స్వతంత్రం సాధించినట్లే. అతడి మమతలో నుంచి బయట పడినట్లే."

అతడు ఊరినుంచి వచ్చేటప్పటికి ప్రత్యేక శ్రద్ధతో అలంకరించుకున్నాను.

అతడు దగ్గరగా తీసుకుని "అట్లా ఉండాలి. ఆడవాళ్ళు ఎప్పుడూ నవ్వుతూ ఉండాలి. ఇల్లాలి చిరునవ్వు ఇంటికి అందం" అన్నాడు.

"గుండెలు మండుతున్నా, పెదవులు నవ్వాలి" అందా మనుకున్నాను. అనలేదు.

జ్వరం ఎట్లాగ ఉందని అడగలేదు. తగ్గక ఏం చేస్తుంది అన్నట్లు, ఆ రాత్రి—

"మీరు వెళ్ళాక నాకు తోచలేదు. ఎక్కడికైనా వెళ్ళిపోవాలనిపించింది. ఒంటరిగా ఎక్కడికైనా వెళ్ళిపోదామనుకున్నాను" అన్నాను.

"పిచ్చిదానివి" అన్నాడు. ఆ మాట నన్ను కదలించింది. నాలో కలిగిన ఉద్రేకంలో జరిగినదంతా చెప్పివేయాలనుకున్నాను. నా మాటల వెనక దాగిన అగ్ని పర్వతపు ఉనికిని అతడేమాత్రం సందేహించలేదు. నన్ను ఏమీ మాట్లాడనివ్వలేదు. "కబుర్లు వద్దు" అన్నాడు.

ఆమరునాడు—నాలో బాధగుర్తుకి కూడాలేదు. అతడుదూరమైతేనేబాధ. దగ్గర ఉంటేతృప్తి.

"నిన్న రైలు ఎక్కి వెళ్ళి ఉంటే ఏమయ్యేది ! శాంతి ఎట్లాగా దొరకదు. ఇల్లు వదలి వెళ్ళిన నా గతి ఏమై ఉండేది ! తిరిగి ఇంటికి రాలేను. ఎక్కడో దిక్కులేని జీవితం గడిపి కాలగర్భంలో కలిసిపోయి ఉండేదాన్ని. ఈ ఆనందం, తృప్తి లేనప్పుడు ఆ బ్రతుకు మీద విరక్తి పుట్టకుండా ఉండదు. తిరిగి రావటం మంచిదే అయింది." ఆ రోజంతా సంతోషంగా గడిచింది. "జీవితమంతా ఇట్లా ఉండకూడదూ."

* * *

పోస్టులో అతడికి రిజిష్టర్ కవరు వచ్చింది.

"ట్రెయినింగ్‌కి ఆరు నెలలు నన్ను ఢిల్లీలో వేశారు" అన్నాడు. అతడు.

గుండెలలో ఒక మూలగా చిన్న పోటు ప్రారంభమయింది నాకు.

"ఆరు నెలలే ! ఢిల్లీలో కాపరం పెట్టడం మాటలు కాదు. ఎంత డబ్బూ చాలదు. నువ్వు మీ అమ్మవాళ్ళ దగ్గరకు వెళ్ళికూడా చాలా రోజులయింది. మీ నాన్న రమ్మని రాస్తున్నారు. నువ్వు ఈ ఆరు నెలలూ అక్కడ ఉంటే సరిపోతుంది. నీకు వంట బాధ కూడా తప్పుతుంది. ఏమంటావు."

తల వంచుకుని బాబుకి గుడ్డలు మారుస్తున్న నా కళ్ళలో నీరు సుడులు తిరుగుతోంది. అతడు మళ్ళీ ఆర్డర్ చదువుతూ.

> "అమ్మంత పెద్దదాని వయింతర్వాత ఏం చేస్తావ్!" పాపని ఎవరో బుజ్జగిస్తూ అడిగారు.
>
> "వంట చేస్తాను!" సమాధానానికి తడుముకోలేదు పాప.
>
> రంగారావ్

"ఏమంటావ్" అంటున్నాడు.

చిన్నగా ప్రారంభించిన పోటు క్రమంగా పెద్దదయింది. గుండె పగిలిపోతే బాగుండును. నాకు ఆలోచన అనేది లేకుండా మెదడు మాయ మయిపోతే బాగుండును. ఈ తలని గోడకేసి కొట్టుకొంటే బాధ నివారణ అవుతుంది.

"ఏమంటావు ! ఏమంటావు !" ఏటిలో దూకి చచ్చిపోతాను— అంటాను. నేను ఉండలేను— ఉండలేను. ఎందుకు పుట్టింటికి కూడా వెళ్ళటం మానుకుని — బాలింతరాలైనా ఇంటి పనులన్నీ చేసుకుని పడి ఉన్నాను. ఇదంతా ఈ శ్రమా ఈ ప్రాకులాట అంతా వ్యర్థం. కాదనకుండా, లేదనకుండా అడిగిన కోరికలన్నీ తీర్చాను. ఎన్నో మాట్లు చెప్పాను ఊళ్ళు చూడటం నాకు ఒకటే కోరిక అని. అందుకైనా తీసుకు వెళ్ళవచ్చే. అతడికి ఆరు నెలలు. నాకు ఆరు దీర్ఘమైన అనంత యుగాలు. క్షణం సంవత్సరాలుగా పెరిగిపోయే తరగని యుగాలు. "వెళ్ళిపొండి— వెళ్ళిపొండి— మళ్ళీ నన్ను చూడకండి. నేను వెళ్ళిపోతాను. పుట్టింటికికాదు. ఎవరికీ తెలియకుండా ఎక్కడికో. వద్దు. ఇతడిని నేను భరించలేను. ఈ నిర్దాక్షిణ్యాన్ని నేను సహించలేను." నా హృదయం ఆక్రోసిస్తోంది—

"ఏమంటావు !" అతడు మళ్ళీ అడిగాడు.

"అట్లాగే అంటాను." అన్నాను కఠినంగా. అతడు వెళ్ళిపోయాడు.

"అతడు తిరిగివచ్చి రమ్మంటాడు. వెళ్ళకూడదు. గ్రాడ్యుయేట్ అవ్వాలి. ఉద్యోగం చేస్తూ ఒంటరిగా నేండాలి. నా మనసులోని ఆరాటాన్ని గ్రహించలేని వాడితో నేను బ్రతకలేను. అయిపోయింది నా బ్రతుకు. ప్రేమమయ జీవితం— ఆర్ద్రత— అన్నీ నశించాయి."

* * *

రెండు నెలలు గడిచాయి. పుస్తకాలు మూలపడ్డాయి.

"నాన్నా ఢిల్లీ పంపించండి." నా కళ్ళలో తడి, కంఠంతో గద్గదికత చూశారు. ఏమీ అనలేదు. ప్రయాణానికి ఏర్పాటు చేశారు.

కూతురి ఆవేదన ఒక్కమాటలో అర్థం అవుతుంది. జీవితాంతం భార్య మనసు అర్థం కాదు మగవాడికి.

"నువ్వు తొందర పడ్డావు." అన్నాడు అతడు.

"పోనీ, వచ్చేశావు. నాకు సంతోషంగా ఉంది" అని ఒక్కమాట అనలేదు అతడు.

"ఎందుకు వచ్చాను" అనే పశ్చాత్తాపమే కలిగింది. "రాకుండా ఉంటేనే బాగుండేది." అన్నాను ద్వేషం రగిలిన మనసుతో.

"నాకు సుఖంగానే ఉంది. నా స్నేహితుడు, భార్యా చాలా మంచివారు" అన్నాడు.

నాకు దూరంగా ఉండి— సుఖంగా ఉండగలడు అతడు. ఎవరి మధ్యనైనా సుఖంగా ఉండగిలడు అతడు. ఇతడు లోకచరిత్రకి అతీతుడని ఎందుకు అనుకోవాలి ! ఆవిడ చదువు నన్ను దహించివేస్తుంది. అతడి చిరునవ్వులు నన్ను చిత్రవధ చేస్తాయి. స్నేహితుడి భార్య ! ఆ మంచితనానికి చదువుకి సరిహద్దు ఎక్కడ ! ఈ చదువు వెనక ఏ చీకటి చరిత్రా లేదుగదా ! అనుమానించే హీన స్థితికి కూడా వచ్చాను. ఈ బాధని అసూయ అంటారు. ఎంత భయంకరము — అసంతృప్తి సహితమూ అయింది నా జీవితం ! అసలు లోకంలో ధర్మం— నీతి అనేవి ఉన్నాయా ?

* * *

స్త్రీ ఇవ్వటానికే పుట్టింది. తీసుకోవటానికికాదు. నాలో బలహీనత ఉంది. నేను ఓడిపోయాను. నాలో ఒక అంశమేనా ఈ విప్లవాన్ని సముద్ధరించుకుని ప్రతీకారం తీర్చుకోవాలి. నా 'రాధ' స్వతంత్ర భావాలతో పెరుగుతుంది. ప్రేమ భావాలకి, సంగీత, సాహిత్యాలకి దూరంగా పెంచుతాను. ప్రస్తుతం స్త్రీ— బలాన్ని స్వతంత్రాన్ని తనలో నింపుకుంటోంది. ఏమో ! ఒకనాడు స్త్రీ ప్రకృతిని ప్రతిఘటించి పురుషుడితో సమానం అవుతుందేమో. అదే ఈ విశాల విశ్వానికి ఆధార భూతమైన రహస్యం ఏమో. కాలానికి అంతం అక్కడేనేమో!

"నీకు చాలా ఓర్పు వచ్చింది" అంటాడు అతడు. అతడికేమి తెలుసు ! ఇప్పుడు నాలో కోర్కెలు లేవు— అసలు నాకు బ్రతుకు లేదు. నాలో జీవిస్తున్నది ఒక ప్రతీకారం— ఒక ఆశయ సాధన— అంతవరకూ నేను ఒక యంత్రాన్ని మాత్రమే.

చదవటం పూర్తి అయింది. ఒక నిట్టూర్పు వెలువడింది.

"ఇదా— అమ్మ. తనలో మథన పడుతూ, తన బాధలో పాలు పంచుకునే వారు లేక హృదయంలో ఒంటరి బ్రతుకు బ్రతికింది అమ్మ."

ఈనాటి సమాజంలో— పాత, కొత్తల సంఘర్షణ మధ్య— ఆధునిక భావాల ఆకర్షణకి తట్టుకోలేక, జీర్ణించుకున్న సంప్రదాయాలను వదలలేక

స్త్రీ ఎంత వరకూ స్వతంత్రంగా ఉండకలదు! పురుషుడి ఆధిక్యత కల్పితమా, స్వత సిద్ధమా? అని గుర్తించి ఈర్ష్య పడితే స్త్రీ ఏనాటికైనా తనలో రేగే హాలాహల సదృశమయిన అశాంతిని అణిచి జయించ గలుగుతుందా? తృప్తి, శాంతి లభిస్తాయా ఆమెకి!

ఇందులో నిజానిజాలేవైనా, పురుషుడి సహచర్యాన్ని స్వీకరించి, స్వార్థం కొంత త్యాగం చేసి అతడిని ప్రేమించగలిగితేనే ఆమెకి తృప్తి ఉంది. స్త్రీ స్వతంత్రం కోరితే ఆ దాహానికి అంతు లేదు. అది, తనని, పిల్లల్ని కూడా నాశనం చేస్తుంది.

అమ్మకి చిన్నతనంలో పెళ్ళికావటం — ఇవి అర్థం చేసుకోగల అవకాశం లభించలేదు. ఆమె హృదయం వికసించకనే రాలిపోతున్న మొగ్గ.

"నా హృదయం అమ్మకోసం జాలిపడుతోంది బనా ప్రకాశరావ్‌ని వదులుకోలేను. బలవత్తరంగా ఆకర్షించే అతడి ప్రేమనుంచి తప్పించుకోలేను. ఒక రకంగా అమ్మవల్లనే అతడిని అర్థం చేసుకోగల అవకాశం లభించింది. ఈ ఏడాది అతడు నాకు మరీ దగ్గర అయ్యాడు."

"మగ వాళ్ళకి కామం ఎక్కువ. ప్రేమ ఉండదు." అంటే.

"నిజమే కాని నేను నీతి నియమంలేని వాడిని కాదు. అసలు అనుకూలమైన జంట దొరకాలి గానీ నీతి నియమంలో ఉన్న ఆనందం. విశృంఖల ప్రేమలో లేదు. నిరీక్షణ, విరహం లేనిదే ప్రేమ, కాంక్ష అనేవి పరిపూర్ణతని, సంతృప్తిని ఇవ్వలేవు. అందుకే నియమ రాహిత్యమైన ప్రేమలో తీరని అసంతృప్తి." అన్నాడు.

ప్రకాశరావ్ దగ్గర ఏవిషయమూ దాపరికం లేకుండా మాట్లాడటం అలవాటయింది నీరజకు. కోపం వస్తే "నాకు కోపం వచ్చింది" అని చెప్పే టంత స్నేహం కుదిరింది. బనా దాంపత్య జీవితంలో—

భేదాభిప్రాయాలూ — వైమనస్యాలూ వస్తాయా?

అతడు ఇంకొక స్త్రీకి ఆకృష్టుడవుతాడా?

ఒకసారి చనువు తీసుకుని అతడు ముద్దు పెట్టుకున్నాడు. క్రోధావేశంలో తను ఆ మధురిమ అనుభవించలేక పోయింది. కోపం నటిస్తూ,

"వివాహత్పూర్వ ప్రేమ పనికిరాదు." అంటే అతడు నవ్వి,

"అంత ఆకర్షిస్తావని చెప్పడానికి" అన్నాడు.

ఇన్నాళ్ళూ అమ్మ వద్దు అందని, కానీ— నేను ప్రకాశరావ్‌ని వదులుకోలేను" అనుకుంది నీరజ.

* * *

డైరీ ఇచ్చేస్తుంటే.

"ఇప్పుడు నీ అభిప్రాయం మారింది కదూ నీరజా" అంది రమాదేవి.

"లేదమ్మా, ఎప్పటికైనా వివాహం చేసుకోవలసినదే. మగవాళ్ళని అర్థం చేసుకోగల తెలివితేటలు ఉండాలి. అందరు ఆడవాళ్ళూ ఇట్లా మథన పడుతున్నారంటావా అమ్మా. మథనపడే మొగవాళ్ళూ లేరూ." అంది నీరజ. రమాదేవి మొదట తెల్లబోయింది. తరవాత ఆవిడ కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"ఆడ దాని అందం, తెలివితేటలూ పని చెయ్యవు నీరజా, జయుపంజాల చేయగలిగితే తప్ప" అంది. కొంత సేపయ్యాక తిరిగి కఠినంగా.

"వీల్లేదు.. నువ్వు నేను చెప్పినట్లు వినాలి. ఇంత కష్టపడి పెంచిన తల్లిదండ్రులమీద పిల్లలు కృతజ్ఞత చూపించాలి. నువ్వు ఉద్యోగం చేస్తూ, డబ్బు సంపాదిస్తుంటే ఉన్న ఆధిక్యత, స్వతంత్రం — పెళ్ళి అయి భర్త సంపాదనమీద ఆధారపడినా, పిల్లలు పుట్టినా ఉండవు. నీరజా, చదువుకున్నావు, తెలివైన దానివి. నీ కాళ్ళ మీద నిలబడగలిగినంత దానిని చేశాము నిన్ను, నా ఆశయం తీర్చు నీరజా.

"పురుషుడి అధికారానికి లోబడకుండా, స్త్రీ స్వతంత్రంగా జీవించగలదని నిరూపించు — పెళ్ళి వద్దను.

"భర్త మంచివాడైనా పిల్లలను బంధంగా ప్రకృతి స్త్రీని బానిసగా చేసింది. పెళ్ళి అయితే నీ హృదయానికే, నీ బాధ్యతలకే నీవు బానిసవయిపోతావు. ఈ మమకారమనే వలలో పడిపోకు. . ."

"లేదమ్మా, నువ్వు సమంగా జీవితాన్ని అర్థం చేసుకోలేదు. దాంపత్యంలో అధికారం బానిసత్వం లేవు. అది స్నేహం లాంటిది. పరస్పరానురాగం స్వార్థ త్యాగాలతో విలసిల్ల వలసినది. పెళ్ళి వద్దనటం ప్రకృతికి వ్యతిరేకం. ప్రవాహ వేగాన్ని ఎదురీదితే మిగిలేది ఏమిటమ్మా?" అంది నీరజ.

నీరజ పెదవుల మీద నవ్వు చూసింది రమాదేవి.

అంతేనా! అంది సన్నగా అణగారిపోతున్న గొంతుతో ఆవిడ ఆశయం ఛిన్నాభిన్నమై పోయింది. ఆవిడ కళ్ళ ఎదట ఈ ప్రపంచ గోళం సూక్ష్మాతి సూక్ష్మంగా కనుమరుగై మహా సూన్యం మిగిలిపోయింది. ఆవిడకి మతిలేదు. నీరజ పెళ్ళి నిశ్చయమైంది.

* * *

"పోనీ, నేను పెళ్ళి చేసుకోమనానా" అందినీరజ.

"నీ మనస్ఫూర్తిగా అంటున్నావా నీరజా" అని తండ్రి అడిగితే, కన్నులు వాల్చుకుంది నీరజ.


"నాకు తెలుసు. వద్దు తల్లీ. నువ్వు ఆత్మవంచన చేసుకోవద్దు. తల్లిదండ్రుల బలహీనతలకు పిల్లలు గురికాకూడదు. ఇది అనుభవించ వలసిన వాడిని నేనే. మీ అమ్మ తత్త్వం మొదటే గుర్తించాను నేను. అందుకని సాధారణంగా ప్రతిది ఆవిడ ఇష్టానికే వదిలేవాడిని. అందరూ నన్ను భార్యా దాసుడన్నారు. అది సహించడం నాకేం కష్టం కాలేదు. కానీ నీ జీవితం నాశనమవటం నేను సహించలేను. ఈ పెళ్ళి జరిగి తీరుతుంది" అన్నారాయన.

పెళ్ళికూతురు వచ్చి పీటలమీద కూర్చుంది. తెర తీయగానే చిరుహాసంతో, విజయపూర్వకంగా నీరజ ముఖంలోకి చూశాడు ప్రకాశరావ్. ఒకసారి అతడి వైపు చూసి తల వంచుకుంది నీరజ. ఆమె విశాల, వినీల నయనాలు క్రింది చూపులు చూస్తూ —

"అవును, జీవితం సుఖ దుఃఖాలు రెండిటి చేతే బరువయినది. ఈ ద్వంద్వాలే జీవిత సత్యం, జీవితానికి అందం కూడాను. దీనిని సహించటానికి భయపడటమెందుకు? ఓర్పు, వివేకం, శాంతం వీటిని సాధించానంటే జీవితాన్ని చిరునవ్వుతో అనుభవిస్తాం." అనే స్వాంతన వచనాలు పలుకుతున్నాయి. నీరజ మెడలో ప్రకాశరావ్ మంగళ సూత్రం కట్టాడు. మంగళ వాయిద్యాలు గంభీరంగా, ఆనందంగా నినదించాయి ★


పండిత డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
ఆయుర్వేదాశ్రమం (ప్రైవేట్) లిమిటెడ్
మదరాసు-17

RATNAM'S N-OIL
(పై పూతకు మాత్రమే)
అంగనరములు. బలహీనత చెంది, చిన్నదైనచో తిరిగి యథాప్రకారం అయిపూర్తి సౌఖ్య మనుభవించుటకు 50 సం|| ప్రఖ్యాతి గలది. 1 సీసా రూ. 10/-లు వి. పి. 1-50. కావలసినవారు ఎడ్రెస్సు పంపేది. ఇందులో స్పెషల్ రకం అర్జంటు గుణమునకు రూ. 25-00 లు వి. పి. రూ. 2-00.
డాక్టర్ రత్నం సన్స్, (Estd 1904)
మలకపేట బిల్డింగ్స్, ఆజంపూరా మార్కెట్‌వద్ద,
హైదరాబాద్-24 (ఆంధ్రప్రదేశ్)



పెప్స్‌ను చప్పరించి, వాప్పని నివారించే బర్మ్యాను అరుపునట్టి అందరి శమనకర ఆవిరులను ఆస్వాదించండి, అవి గొంతు నొప్పి, రొమ్ము పడిశెము, దగ్గు లేక జలుబునుగలిగించే క్రిములను చంపును. పెప్స్ తక్షణ నివారణను గలిగించి క్రిములను నిర్మూలించును.


ఇందులో హానికర ఓషధులు లేవు పిల్లలకు సురక్షితంగా ఇవ్వవచ్చును.
రొమ్ము పడిశెములు గొంతు నొప్పి, పడిశెము, అధిక కఫము జలుబులు దగ్గులను త్వరితంగా నివారించును
మందుల వ్యాపారులందరివద్ద అమ్మబడుచున్నవి
వి. ఇ. ఫుల్‌ఫోర్డ్ (ఇండియా) ప్రైవేట్ లి.

మద్రాసు స్టేటుకు సోల్ డిస్ట్రిబ్యూటర్లు:
మెసర్స్. మోతీ & కం, మద్రాసు-3.